గురువారం 25-4-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 316, పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..
Mundadugu whatsapp: 9491114616
email: mundadugu111@gmail.com

# తెలంగాణలో కేసీఆర్ బస్సుయాత్ర..

## 17 రోజులు 12 నియోజకవర్గాల్లో ప్రచారం • ఎక్కువ స్థానాలు గెలిచేలా ప్రణాళికలు




**ముందడుగు తెలంగాణ**

గులాబీ దళపతి బుధవారం నుంచి బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కరెంటు కోతలు, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు, హామీల అమలులో జాప్యమే ప్రధాన ఎజెండాగా గులాబీ బాస్.. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ముందుకెళ్లనున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

తెలంగాణ భవన్‌లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన కేసీఆర్.. బస్సు యాత్రను ప్రారంభించారు. మహిళలు మంగళహారతులతో కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. బుధవారం నుంచి 17 రోజుల పాటు ఈ బస్సు యాత్ర రాష్ట్రంలో కొనసాగనుంది. దాదాపు అన్ని పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ఒకట్రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేసీఆర్ రోడ్ షోలు నిర్వహించే విధంగా ఈ బస్సు యాత్రను బీఆర్‌ఎస్ పార్టీ ప్లాన్ చేసింది. మే 10 వ తేదీ వరకు జరగనున్న ఈ బస్సు యాత్ర.. మిర్యాలగూడలో ప్రారంభమై.. చివరికి సిద్ధిపేట బహిరంగ సభతో ముగియనుంది.

కేసీఆర్ బస్సు యాత్రలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు దాదాపు 100 మందికిపైగా వాలంటీర్లను నియమించారు. ఈ బస్సు యాత్ర ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఎక్కువ స్థానాలు వచ్చేలా ప్రణాళికలు వేస్తున్నారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంపై ప్రధానంగా ఎన్నికల ప్రచారం సాగించనున్నారు.



బద్రీనాథ్, కేదార్‌నాథ్‌కు ఐఆర్‌సీటీసీ టూర్ ప్యాకేజ్

02



స్కూల్స్ లోకి టీచర్లు తుపాకులు తీసుకెళ్లొచ్చు

02

# భారాసకు ఓటు వేస్తే మూసీలో వేసినట్లే

- కిషన్‌రెడ్డి నగరానికి చిల్లిగవ్వ తేలేదు
- సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురుతది
- సికింద్రాబాద్ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి



**ముందడుగు హైదరాబాద్:**

ఆనాడు దత్తాత్రేయని ఓడించి.. అంజన్ కుమార్ యాదవ్ సికింద్రాబాద్‌లో మూడు రంగుల జెండా ఎగరేశారు. అప్పుడు కేంద్రంలో సోనియమ్మ నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మళ్లీ 20 ఏళ్ల తర్వాత ఆనాటి రోజులను పునరావృతం చేయడానికి దానం నాగేందర్ మిగతా 2లో




# ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు విడుదల


- ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా టాప్
- సెకండ్ ఇయర్ ఫలితాల్లో ములుగు జిల్లా ప్రథమ స్థానం

**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు బుధవారం ఉదయం 11 గంటలకు నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బోర్డు కార్యదర్శి శృతి ఓజా వెల్లడించారు.

### ఈ సారి బాలికలదే పైచేయి..

ఫస్టియర్‌లో 60.01 శాతం, సెకండియర్‌లో 64.19 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ మిగతా 2లో



రైల్వే ప్రయాణీకులకు రూ.20కే భోజనం

04

ముందడుగు
గురువారం
25-4-2024
హైదరాబాద్

# బిఆర్ఎస్ రెండు ఎంపీలు గెలిస్తే రాజీనామా చేస్తా

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్



**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణలో ఎంపీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ కనీసం 2 స్థానాల్లో గెలిచిన తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ చేశారు. నల్గొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆయన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాకు తీరని అన్యాయం చేసిన కేసీఆర్.. ఏ ముఖం పెట్టుకొని మిర్యాలగూడకు వస్తారని ప్రశ్నించారు. నల్గొండలో బిజెపి, బిఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి, జిల్లాకి ఏమీ చేయని బిజెపి పార్టీకి ఓటు అడిగే హక్కు లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ మనుగడ ఉండదని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ఒక్క సీటు కూడా గెలవదని చెప్పారు. కేసీఆర్ నిర్లక్ష్యం వల్లే జిల్లాలో అభివృద్ధి జరగలేదన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సీఎం అయ్యే అర్హత ఉందని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నట్లు తెలిపారు.

# బద్రీనాథ్, కేదార్‌నాథ్‌కు ఐఆర్‌సీటీసీ టూర్ ప్యాకేజ్

## జూన్ 5 నుంచి ఈ యాత్ర ప్రారంభం



**ముందడుగు జాతీయం:**

భారతదేశంలో హిందువులు అత్యంత పవిత్రంగా భావించే యాత్ర చార్ ధామ్. గంగోత్రి, యమునోత్రి, బద్రీనాథ్, కేదార్‌నాథ్.. ఈ నాలుగు క్షేత్రాలను కలిపే చార్‌ధామ్‌గా పిలుస్తారు. వేసవిలోనే ఈ యాత్ర మొదలవుతుంది. ఇందులో బద్రీనాథ్, కేదార్‌నాథ్‌కు వెళ్లాలనుకునే వారికి ఐఆర్‌సీటీసీ అద్భుతమైన టూర్ ప్యాకేజీని తీసుకొచ్చింది. ఈ ప్యాకేజీ తీసుకుంటే హరిద్వార్, గుప్తకాశి, కేదార్ నాథ్, బద్రీనాథ్, రిషికేశ్‌ను సందర్శించే అవకాశం లభిస్తుంది. ఇది 8 పగలు, 7 రాత్రులు ఉంటుంది. ఈ ప్యాకేజీలో మీరు ఆహారం, వసతి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్యాకేజీలోనే బ్రేక్ ఫాస్ట్, డిన్నర్ సదుపాయం లభిస్తుంది. ఐఆర్‌సీటీసీ అధికారిక వెబ్‌సైట్ నుంచి ఈ ప్యాకేజీని బుక్ చేసుకోవచ్చు. ప్యాకేజీకి సంబంధించిన సమాచారం కొరకు మీరు 82879312886 సంప్రదించవచ్చు.

ఈ ప్యాకేజీని దో ధామ్ యాత్ర ఎక్స్ నాగ్ పూర్ (డబ్ల్యుఎంఎ78)గా పిలుస్తున్నారు. ఇది జూన్ 5, 2024 నుంచి ప్రారంభమవుతుంది. ప్యాకేజీ కింద బ్రేక్‌ఫాస్ట్, డిన్నర్ ఇస్తారు. లంచ్ మాత్రం మీరే చేయాల్సి ఉంటుంది. ఐఆర్‌సీటీసీ దో ధామ్ టూర్ ప్యాకేజీ రూ.46,900 నుంచి ప్రారంభమవుతుంది. ట్రిపుల్ ఆక్యుపెన్సీకి రూ.46,900 అయితే.. డబుల్ ఆక్యుపెన్సీ ధర రూ.49,800గా ఉంది. సింగిల్ ఆక్యుపెన్సీకి రూ.73,700 చెల్లించాల్సి ఉంటుంది. వచ్చే నెలలో చార్ ధామ్ క్షేత్రాలను తెరుస్తారు. ఈ యాత్రకు ఫుడ్ డిమాండ్ ఉంటుంది.

# ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి

పరీక్షలకు మొత్తం 4.78 లక్షల విద్యార్థులు హాజరుకాగా.. 2.87 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ పరీక్షలకు మొత్తం 5.02 లక్షల మంది హాజరవగా.. 3.22 లక్షల మంది పాసయ్యారు. ఎప్పటిలాగే ఈసారి కూడా బాలుర కంటే బాలికలదే పైచేయిగా ఉంది. బాలికల కేటగిరీలో ఫస్టియర్‌లో 68.35 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా.. బాలుర కేటగిరీలో కేవలం 51.5 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ బాలికల కేటగిరీలో 72.53 శాతం మంది ఉత్తీర్ణులు కాగా.. బాలుర కేటగిరీలో 56.1 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

**జిల్లాల వారీగా ఫలితాలు..**

జిల్లాల వారీగా చూసుకుంటే ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా 71.7 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో ఉండగా.. మేడ్చల్ జిల్లా 71.58 శాత ఉత్తీర్ణతతో ద్వితీయ స్థానంలో, ములుగు జిల్లా 70.01 శాతం ఉత్తీర్ణతతో తృతీయ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా సెకండ్ ఇయర్ ఫలితాల్లో 82.95 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లాకు ప్రథమ స్థానం, 79.31 శాతం ఉత్తీర్ణతతో మేడ్చల్ జిల్లాకు ద్వితీయ స్థానం, 77.63 శాతం ఉత్తీర్ణతతో రంగారెడ్డి జిల్లాకు తృతీయ స్థానం దక్కాయి.

# ఈనెల 30న పది ఫలితాలు

**ముందడుగు తెలంగాణ:**

పదో తరగతి ఫలితాల విడుదలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఈనెల 30వ తేదీన రిజల్ట్స్ అనౌన్స్ చేయనున్నట్లు విద్యాశాఖ స్పష్టంచేసింది. ఇందుకు ముహూర్తం సైతం ఫిక్స్ చేశారు. ఈనెల 30న ఉదయం 11 గంటలకు ఫలితాలు ప్రకటించనున్నట్లు స్పష్టంచేశారు. ఫలితాలను విద్యాశాఖ సెక్రటరీ బుర్ర వెంకటేశం ఫలితాలను విడుదల చేయనున్నారు. ఇదిలా ఉండగా మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు టెన్త్ పరీక్షలు జరిగాయి. మొత్తం 5,08,385 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 2,676 పరీక్ష కేంద్రాల్లో టెన్త్ ఎగ్జామ్స్ కొనసాగాయి. మూల్యాంకనం పూర్తవడంతో డీకోడింగ్ ప్రక్రియ సైతం చివరి దశకు చేరుకుంది. 30వ తేదీన ఉదయం 11 గంటలకు పది ఫలితాలు విడుదల చేయనున్నారు.

# స్కూల్స్ లోకి టీచర్లు తుపాకులు తీసుకెళ్లొచ్చు

## అమెరికా టెన్నెస్సీ స్టేట్ హౌస్ సంచలన నిర్ణయం

**ముందడుగు అమెరికా:**



టీచర్లు స్కూల్స్‌లోకి తుపాకులు తీసుకెళ్లేందుకు అగ్రరాజ్యంగా పేరుగాంచిన అమెరికాలోని టెన్నెస్సీ స్టేట్ హౌస్ ఆమోదం తెలుపుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. అమెరికాలో గన్ కల్చర్ పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే స్కూల్స్‌లోకి ఈ తుపాకీ సంస్కృతి చేరడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వివాదాస్పద బిల్లుపై ఏకంగా సభలోనే నిరసనలు వ్యక్తమైన బిల్లు మాత్రం పాస్ అయ్యింది. అగ్రరాజ్యం అమెరికాలో తుపాకీ సంస్కృతి రోజురోజుకు పెరిగిపోతుంది. ఈ గన్ కల్చర్‌పై ప్రజలు ఆందోళన చెందుతున్న సంగతి తెలిసిందే. తుపాకీలతో దాడులు పెరగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టాలని.. తుపాకీ వినియోగంపై ఆంక్షలు విధించాలని ప్రజలు రోడ్డెక్కినిరసన తెలుపుతున్న సంగతి తెలిసిందే. ఇలాంటి తరుణంలో ఏకంగా స్కూల్‌లోకి తుపాకులు తీసుకెళ్లేందుకు టీచర్లకు అనుమతినిచ్చే బిల్లుకు అమెరికాలోని టెన్నెస్సీ స్టేట్ హౌస్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు పాస్ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సభలో బిల్లుపై చర్చ జరుగుతుండగా సందర్శకులుగా హాజరైన పలువురు టీచర్లు, స్టూడెంట్లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బిల్లును పాస్ చేస్తూ సభలో స్పీకర్ తీర్మానం చదువుతుండగా 'బ్లడ్ ఆన్ యువర్ హ్యాండ్స్' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అంతేకాదు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించారు. దీంతో స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సందర్శకుల గ్యాలరీ ఖాళీ చేయించి మరీ బిల్లును పాస్ చేశారు.

# ప్రమాదవశాత్తు పేలిన తుపాకీ

## సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ మృతి

**ముందడుగు భద్రాద్రి కొత్తగూడెం:**

అడవిలో కూంబింగ్ వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదవశాత్తు తుపాకీ పేలడంతో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్ శేషగిరి రావు మృతిచెందారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పూసుగుప్పలోని 81వ బెటాలియన్‌లో చోటు చేసుకుంది. సమీపంలోని అడవిలో కూంబింగ్‌కు శేషగిరిరావు వెళ్లారు. తిరిగి వస్తున్నప్పుడు కిందపడిపోయారు. ఈ క్రమంలో ఆయన వద్ద ఉన్న ఏకే 47 తుపాకీ పేలి ఛాతీ కింది భాగంలో తూటా దిగింది. అపస్మారక స్థితికి చేరుకున్న శేషగిరిని మిగిలిన జవాన్లు బేస్ క్యాంప్ వద్దకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి 73 కి.మీ దూరంలోని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆయన మృతిచెందారు. శేషగిరి ఏపీలోని అనంతపురం జిల్లా వాసిగా తెలిసింది.



# భారాసకు ఓటు వేస్తే మూసీలో వేసినట్లే

మొదటిపేజీ తరువాయి

3 రంగుల జెండా ఎగరేయబోతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిజెపి నాయకులు గెలిచి కేంద్ర మంత్రులు అయినా హైదరాబాద్‌కు చేసిందేమిటి? వరదలు వచ్చి హైదరాబాద్ అతలాకుతలమైతే కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి నగరానికి చిల్లిగవ్వ తేలేదు. జంట నగరాల్లో మెట్రో రైలు రావడానికి కాంగ్రెస్సే కారణం అన్నారు.

బిఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు మంచోడే కానీ.. కేసీఆర్‌ను నమ్ముకుంటే ఆయన మునిగినట్లే. అతని పరువు తీయడానికే సికింద్రాబాద్ అభ్యర్థిగా నిలబెట్టారు. పద్మారావు నామినేషన్‌కు కేటీఆర్, కేసీఆర్ ఎందుకు రాలేదు? ఆయనకు వాళ్లు మద్దతు ఇవ్వడంలేదు. సికింద్రాబాద్ టికెట్‌ను బిజెపికి తాకట్టు పెట్టారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు న్యాయం చేసే బాధ్యత మాది. నగరానికి కృష్ణా, గోదావరి జలాలు తెచ్చింది ఎవరో చర్చ పెడదాం.. ఇందుకు కేటీఆర్ సిద్ధమా? భాకు ఓటు వేస్తే మూసీలో వేసినట్లే. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌దే. మత సామరస్యాన్ని కాపాడింది మా పార్టీ. దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి. దేవుడిని ప్రధాని మోదీ బజారులోకి తీసుకొచ్చారు. మత చిచ్చుపెట్టి ఎన్నికల్లో నెగ్గాలని భాజపా చూస్తోంది'' అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

ముందడుగు
గురువారం
25-4-2024
హైదరాబాద్

# భారత్ ఆహార పదార్థాల్లో క్యాన్సర్ కారకాలు

- 527 ఆహార ఉత్పత్తుల్లో ఈ ఎథిలీన్ ఆక్సైడ్
- మసాలా పౌడర్లలో గుర్తించిన హాంకాంగ్, సింగపూర్
- గుర్తించిన ఈయూ ఫుడ్ సేఫ్టీ అథారిటీ

ముందడుగు జాతీయం:

భారత్ నుంచి వివిధ ఆహార పదార్థాలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ ఆహార ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నట్లు ఆయా దేశాలు గుర్తిస్తున్నాయి. ముఖ్యంగా క్యాన్సర్ కారకంగా భావిస్తున్న ఎథిలీన్ ఆక్సైడ్ ను మసాలా పౌడర్లలో గుర్తించిన హాంకాంగ్, సింగపూర్ ఇప్పటికే వాటిపై నిషేధం విధించాయి. ఇదే క్రమంలో యూరోపియన్ యూనియన్ కూడా తాజాగా 527 భారతీయ ఆహార ఉత్పత్తుల్లో ఈ ఎథిలీన్ ఆక్సైడ్ ను గుర్తించింది. దీనిపై తదుపరి చర్యల కోసం సిద్ధమవుతోంది.



2020 సెప్టెంబర్ నుంచి 2024 ఏప్రిల్ వరకూ జరిపిన తనిఖీల్లో భారత్ నుంచి దిగుమతి చేసుకున్న 527 ఆహార ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారక ఎథిలీన్ ఆక్సైడ్ ఉన్నట్లు ఈయూ ఫుడ్ సేఫ్టీ అథారిటీ గుర్తించింది. ఇందులో ప్రధానంగా గింజలు, నువ్వులు (313), మూలికలు, సుగంధ ద్రవ్యాలు (60), ఆహారపు ఆహారాలు (48), ఇతర ఆహార ఉత్పత్తులు (34) ఉన్నట్లు తేలింది. ఇదే క్రమంలో అధికారులు 87 కన్ సైన్ మెంట్లను సరిహద్దుల నుంచి తిప్పిపంపినట్లు, మిగిలిన వాటిని కూడా మార్కెట్ నుంచి తప్పించినట్లు తెలిపారు. ఇథిలీన్ ఆక్సైడ్ అనేది ఓ రంగులేని వాయువు. దీన్ని పురుగుమందు, స్టెరిలైజింగ్ ఏజెంట్ గా వాడతారు. అయితే ఈ రసాయనం వాస్తవానికి వైద్య పరికరాలను క్రిమిరహితం చేయడానికి ఉద్దేశించబడింది. ఇథిలీన్ ఆక్సైడ్ ప్రభావంతో క్యాన్సర్లలో లింఫోమా , లుకేమియా వంటివి వస్తాయని డాక్టర్లు చెప్తున్నారు. యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలలో ఆహార భద్రతను గుర్తించే ఆన్‌లైన్ సిస్టమ్ ఫర్ ఫుడ్ అండ్ ఫీడ్ కోసం రాపిడ్ అలర్ట్ సిస్టమ్ నుండి అందుబాటులో ఉన్న డేటా ప్రకారం 525 ఆహార ఉత్పత్తులు, రెండు ఫీడ్ ఉత్పత్తులలో రసాయనం కనుగొన్నట్లు చూపిస్తున్నారు

# శాంతియుతంగా ఉండలేని వారికి ఎన్నికలెందుకు

## కోల్ కతా హైకోర్టు సీరియస్ వార్నింగ్

ముందడుగు పశ్చిమ బెంగాల్:

పశ్చిమబెంగాల్లో ఎలాగైనా గెలవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్న బీజేపీ, టీఎంసీ తాజాగా శ్రీరామనవమి సందర్భంగా చోటు చేసుకున్న మతఘర్షణలను రాజకీయంగా వాడుకునేందుకు చూస్తున్నాయి. ఈ క్రమంలో ఇరువురికి కోల్ కతా హైకోర్టు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. బెంగాల్లోని ముర్షిదాబాద్ లో శ్రీరామనవమి సందర్భంగా చోటు చేసుకున్న ఘర్షణల్లో 19 మంది వరకూ గాయపడ్డారు. దీనిపై తీవ్రంగా స్పందించిన కోల్ కతా హైకోర్టు ఇవాళ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ ముర్షిదాబాద్ జిల్లాలో ఘర్షణలు చోటు చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. శాంతిని కాపాడలేని ప్రజలకు ఎన్నికలు కోరుకునే హక్కు లేదని కోల్ కతా హైకోర్టు అభిప్రాయపడింది. శాంతియుతంగా ఉండలేని వారికి ప్రజాప్రతినిధి ఎందుకని కోల్ కతా హైకోర్టు ప్రశ్నించింది. అంతే కాదు ఇదే పరిస్థితి కొనసాగితే ముర్షిదాబాద్ లో ఎన్నికలు రద్దు చేస్తామని హెచ్చరించింది. ఈసారి బయట వ్యక్తుల ప్రమేయంతోనే ఈ ఘర్షణలు చోటు చేసుకున్నట్లు భావిస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ఘర్షణలు రెచ్చగొట్టిన వ్యక్తుల వివరాలు ఎల్లుండి లోగా ఇవ్వాలని అధికారుల్ని ఆదేశించింది.



# నడిరోడ్డుపై రోడ్డు ప్రాణం పోయినా ఒక్కరూ పట్టించుకోలే

## చూసీ, చూడనట్టు వెళ్లిపోయిన బాటసారులు

ముందడుగు గుజరాత్:

మనిషికి మానవత్వం కరువైపోతుంది.. రోడ్డు ప్రమాదం ప్రమాదం జరిగితే ఒక్కరూ, ఇద్దరూ తప్ప స్పందించే వారే కరువైపోతున్నారు. అలాంటిది అహ్మదాబాద్‌లో ఓ వ్యక్తి స్కూటీపై వెళ్తుండగా హఠాత్తుగా బస్సు వచ్చి ఢీకొట్టింది. అంతేకాకుండా అతడిపై బస్సు టైర్లు ఎక్కించి వేగంగా వెళ్లిపోయాడు. సంఘటనాస్థలంలోనే 52 ఏళ్ల పటేల్ అనే వ్యక్తి ప్రాణాలు వదిలాడు. ఓ బస్సు డ్రైవర్ దారుణంగా ప్రవర్తించి.. కనీసం బస్సు ఆపకుండా వెళ్లిపోతే.. సాటి బాటసారులు.. బైకర్లు మాత్రం కనీసం పట్టించుకోకుండా ఎవరి దారిన వారు వెళ్లిపోవడం మరింత దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. ప్రమాదం జరిగిన కొంత సేపటికి జనాలు గుమిగూడారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాకు చిక్కాయి.



ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. నవీన్ పటేల్ రోడ్డుపై పడి ఉంటే అతనికి సహాయం చేయడానికి ఒక్కరు కూడా ముందుకు రాకపోవడం మరింత దిగ్భ్రాంతిని కలిగించింది. ఈ ఘటనపై నెటిజన్లు మండిపడుతున్నారు. మనుషులకు మానవత్వం లేదంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో మీరు కూడా చూసేయండి.



# ఇంటర్ స్టేట్ టాపర్స్ కు మంత్రి సీతక్క అభినందనలు

ముందడుగు వరంగల్:

తెలంగాణ ఇంటర్ మీడియట్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఇంటర్ ఫలితాల్లో బాలికలే ముందంజలో నిలిచారు. హన్మకొండలోని భీమారం విద్వాన్ జూనియర్ కళాశాలకి చెందిన బైపిసి విభాగంలో స్టేట్ 2 ర్యాంక్ 437/440 సాధించిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన కంచు దివ్య, చీకుర్తి పూజితలను మంత్రి సీతక్క ప్రత్యేకంగా అభినందించి, ఇద్దరిని సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత చదువులు చదివి గ్రామానికి, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తేవాలని సీతక్క అన్నారు. మహిళలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్వాన్ జూనియర్ కళాశాల యజమాన్యం, సిబ్బందిని సైతం అభినందించారు.

# భర్త జ్ఞాపకార్థం గుడి కట్టించిన భార్య

## ప్రత్యేక పూజలతో పాటు, అన్నదానం నిర్వహణ



ముందడుగు మహబూబాబాద్:

భర్త చనిపోతే ఆయన జ్ఞాపకాలను గుర్తుగా ఉంచుకొనేందుకు భార్య గుడి కట్టించింది.. తాజాగా తెలంగాణలోనే ఈ ఘటన వెలుగు చూసింది. ఓ మహిళ తన భర్త తనతో లేదన్న విషయాన్ని భరించలేక తన గుర్తుగా గుడిని కట్టించింది.. ఈ రోజూ ఆ గుడిని ప్రారంభించింది.. అందుకు సంబంధించిన వీడియో కూడా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ లో వెలుగు చూసింది. జిల్లాలోని పర్వతగిరి శివారు సోమ్లా తండాలో కళ్యాణి అనే మహిళ భర్త జ్ఞాపకార్థం గుడి కట్టించింది.. ఆమె భర్త కొన్ని రోజుల క్రితం మరణించారు.. ఆయన గుర్తుగా గుడి కట్టించింది.. ఆ గుడిలో ప్రతి మూలన తన భర్త జ్ఞాపకాలు ఉండేలా ప్రత్యేకంగా విగ్రహాన్ని తయారు చేయించి, ప్రతిష్ట చేసింది. ఈరోజు గుడిని ప్రారంభించి ప్రత్యేక పూజలు చేసింది.. అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించింది..

# రైల్వే ప్రయాణికులకు రూ.20కే భోజనం

- 'బడ్జెట్ ఫ్రెండ్లీ' మీల్స్ పేరుతో ఎంపిక
- దక్షిణ మధ్య రైల్వే 12 స్టేషన్లలో ఈ సదుపాయం
- ఎంపిక చేసిన స్టేషన్లలో ఈ అవకాశం




**ముందడుగు ప్రత్యేకం:**

వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. సెంట్రల్ రైల్వేతో కలిసి తక్కువ ధరకే భోజనం సదుపాయం తీసుకొచ్చింది. 'బడ్జెట్ ఫ్రెండ్లీ' మీల్స్ పేరుతో ఎంపిక చేసిన కొన్ని రైల్వే స్టేషన్లలో మాత్రమే ఈ సదుపాయం ప్రవేశపెట్టింది. ఇప్పుడు ప్రయాణికులు కేవలం ఇరవై రూపాయలకే భోజనం చేయవచ్చు. సెంట్రల్ రైల్వే పరిధిలోని 15 ప్రధాన స్టేషన్లలో బడ్జెట్ ఫ్రెండ్లీ మీల్స్‌ను ప్రారంభించారు. ఈ లిస్టులో ఇగత్‌పురి రైల్వే స్టేషన్, కర్జాత్, మన్మాడ్, ఖాండ్వా, బద్నేరా, షెగావ్, పూణే, మిరాజ్, దౌండ్, సాయినగర్ షిర్డీ, నాగ్‌పూర్, వార్ధా, షోలాపూర్, వాడి, కుర్దువాడి రైల్వే స్టేషన్స్ ఉన్నాయి.

## ధర చాలా తక్కువ

ప్రయాణికులు ఎంపిక చేసుకున్న ఆహారం ఆధారంగా ధరలు ఉంటాయి. కనీస మీల్స్ ధర 20 రూపాయలు. జనరల్ బోగీ ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక సదుపాయాన్ని తీసుకొచ్చారు. ఎకానమీ మీల్ రూ.20కు అందుబాటులో ఉంటుంది. ఇందులో ఏడు పూరీలు, బంగాళాదుంప కుర్మా ఉంటాయి. రూ.50కు రైస్ వంటకాలతో కూడిన 'స్నాక్ మీల్స్' కొనుగోలు చేయవచ్చు.

## తెలుగు రాష్ట్రాల స్టేషన్లలో కూడా..

దేశవ్యాప్తంగా 100 పైగా రైల్వే స్టేషన్లలోనూ 'బడ్జెట్ ఫ్రెండ్లీ' మీల్స్ కౌంటర్స్ ఏర్పాటు చేశారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 12 స్టేషన్లలో ఈ సదుపాయం ఉంటుంది. హైదరాబాద్, విజయవాడ, రేణిగుంట, గుంతకల్, తిరుపతి, రాజమండ్రి, వికారాబాద్, పాకాల, ధోనే, నంద్యాల, పూర్ణ, ఔరంగాబాద్‌లో ఈ కౌంటర్స్ అందుబాటులోకి వచ్చాయి. ప్లాట్‌ఫారమ్‌లపై జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ల దగ్గర ఉన్న కౌంటర్లలో కూడా ఈ మీల్స్ అందుబాటులో ఉంచారు.

## స్విగ్గీతో ఒప్పందం

రైల్వే ప్రయాణికులకు క్వాలిటీ ఫుడ్‌ను అందించడానికి ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ గత నెలలో ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. రైల్వే ప్రయాణికులు రెస్టారెంట్ నెట్‌వర్క్ నుంచి భోజనాన్ని ముందస్తుగా స్విగ్గీ యాప్‌లో ఆర్డర్ చేయవచ్చు. దీంతో నేరుగా కూర్చున్న సీట్ వద్దకే భోజనాన్ని పంపిణీ చేస్తారు. స్విగ్గీతో ఒప్పందం ద్వారా ప్రయాణికులకు క్వాలిటీ ఫుడ్‌తో పాటు అనేక రకాల ఫుడ్ ఆప్షన్స్ అందుబాటులోకి వచ్చాయి.

## ఎలా ఆర్డర్ చేయాలంటే..

ప్రయాణికులు రైలులో నుంచి ఫుడ్‌ను ఆర్డర్ చేసే ప్రక్రియ చాలా సలువుగా ఉంటుంది. ఐఆర్‌సీటీసీ యాప్‌లో ప్రయాణికులు తమ పిఎన్‌ఆర్ నంబర్‌ను ఎన్‌రోల్ చేసి భోజనాన్ని ప్రీఆర్డర్ చేయవచ్చు. డెలివరీ కోసం స్టేషన్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. ఆర్డర్ చేసే సమయంలో అందుబాటులో ఉన్న రెస్టారెంట్స్ క్యూరేటెడ్ జాబితా డిస్‌ప్లే అవుతుంది. భోజనాన్ని ఎంపిక చేసుకున్న తర్వాత, అది తాజాగా ఉండేలా ఇన్సులేటెడ్ స్విగ్గీ బ్యాగ్‌లలో డెలివరీ చేస్తారు.



# వెన్నెల మైక్రో ఫిల్మ్ టీజర్ ప్రారంభం

**ముందడుగు హైదరాబాద్:**

మన ప్రాణాలు మన చేతుల్లోనే ఉంటాయి అనేది ఎంత నిజమో తెలియ చేసే చిన్న ప్రయత్నం ఈ మైక్రో ఫిల్మ్ "వెన్నెల" ఈ మైక్రో ఫిల్మ్ ని శ్రీనాగ్ క్రియేషన్ లో శివ నాగరాజ్ తెరకెక్కించారు. ఈ మైక్రో ఫిల్మ్ టీజర్ ని బుధవారం జబర్దస్త్ కాంటెస్ట్ సత్య శ్రీ ప్రారంభించారు. సత్య శ్రీ మాట్లాడుతూ ఈ మైక్రో ఫిల్మ్ టీజర్ చాలా బాగుంది. ఇదొక రియల్ స్టోరీ మన చుట్టూ జరిగే సంఘటన ఆధారంగా తెరకేక్కిన ఫిల్మ్ ఇలాంటి ఫిల్మ్ ని మన అందరం ఆదరించాలిసిన అవసరం ఉందన్నారు. ఈ మైక్రో ఫిల్మ్ తొందర్లో "పిక్సల్ ఆర్ట్స్ " యూట్యూబ్ లో రిలీజ్ కాబోతుంది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శివ నాగరాజ్, హీరోయిన్ అనూష శ్రీ, ఎడిటర్ కేతన్ కంచర్ల, సోషల్ మీడియా ప్రమోటర్ త్రినాధ్ రెడ్డి, జాఫర్ వలి, అక్షిత ఈవెంట్స్ హాజరయ్యారు.. ఈ సినిమాకి హీరో, హీరోయిన్ గా ప్రసాద్ టోనీ, అనూష శ్రీ, మ్యూజిక్ జాన్ పొట్ల, లిరిక్స్ శ్రీనాథ్ మహీంద్ర, సింగర్ నాగప్రత్యూష సాంకేతకంగా పని చేసారు. డిజిటల్ పార్టనర్ గా తెలుగు హంట్ యూట్యూబ్ ఛానల్ వ్యవహరిస్తోంది.

# పదవ తరగతి మార్కులతో ఆస్పత్రి పాలైన విద్యార్థి

**ఎక్కువ మార్కులు రావడంతో కుప్పకూలిపోయాడు**



**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో మీరట్‌లోని మోడీపురం గ్రామంలోని మహర్షి దయానంద్ స్కూలులో చదువుతున్న 16 ఏళ్ల అన్షుల్ కుమార్‌కు 10 వ తరగతి ఫలితాల్లో ఏకంగా 93.5 శాతం మార్కులు వచ్చాయి.

అయితే అన్ని మార్కులు వచ్చిన ఆ విద్యార్థి ఆనందంతో అక్కడే కుప్పకూలిపోయాడు. దీంతో ఆ విద్యార్థిని తల్లిదండ్రులు, స్థానికులు.. దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అన్షుల్ కుమార్‌ను ఐసీయూకు తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. అన్షుల్ కుమార్ తండ్రి సునీల్ కుమార్.. పోస్టాఫీసులో కాంట్రాక్ట్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లో బోర్డ్ 10 వ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలను శనివారం ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 10 వ తరగతి విద్యార్థులు 89.55 శాతం ఉత్తీర్ణత సాధించగా.. 12వ తరగతి విద్యార్థులు 82.60 శాతం ఉత్తీర్ణత సాధించారు.

# రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నా

- మంత్రి హరీశ్ రావు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రుణమాఫీ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. అన్ని గ్యారంటీలతో పాటు రుణమాఫీ హామీని ఆగస్టు 15లోపు నెరవేరుస్తానని సీఎం ప్రమాణం చేయాలని ఆయన సవాల్ విసిరారు. సంగారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ మాట్లాడారు. ‘‘సీఎం సవాల్‌ను స్వీకరిస్తున్నా. ఇచ్చిన హామీలను అధికార పార్టీ నెరవేర్చేలా చేసే బాధ్యత ప్రతిపక్షంగా మాపై ఉంది. శుక్రవారం అసెంబ్లీ ఎదుట ఉన్న అమరవీరుల స్తూపం వద్దకు నేను వస్తా. సీఎం రేవంత్ కూడా అక్కడికి వచ్చి ఆగస్టు 15లోపు రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేస్తానని ప్రమాణం చేయాలి. హామీని నిలబెట్టుకుంటే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. మళ్లీ ఉప ఎన్నికలోనూ పోటీ చేయను. మాఫీ చేయకపోతే సీఎం పదవికి రేవంత్ రాజీనామా చేస్తారా? నాకు పదవి కంటే తెలంగాణ ప్రజల సంక్షేమమే ముఖ్యం. ఆరు గ్యారంటీలను డిసెంబర్ 9న అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఆ మాట తప్పింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చమంటే పార్టీ రద్దు చేసుకుంటారా అని తొండి మాటలు మాట్లాడుతున్నారు. అధికారంలోకి వచ్చి 120 రోజులైంది.. మీ గ్యారంటీలు ఏమయ్యాయి? మహాలక్ష్మి పథకంలో మహిళలకు రూ.2500, రైతులకు రూ.15,000, నిరుద్యోగులకు భృతి ఎందుకు ఇవ్వలేదు? భారాస అంటే కాంగ్రెస్‌కు ఎందుకంత భయం?’’ అని హరీశ్‌రావు ప్రశ్నించారు.